
2లో.

## ఢిల్లీకి వెళ్లిన సిఎం


# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 256 మంగళవారం 1 అక్టోబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




### దేవుడిని రాజకీయాలకు
# దూరంగా ఉంచండి

**శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని ఎలా గుర్తించారు**

**లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆధారాలు ఉన్నాయా**

**వివరాలు తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారు**

**ప్రస్తుత పరిస్థితుల్లో సిట్ దర్యాప్తుపై అనుమానాలు**

**సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు పలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. మిగతా 2లో.

# దసరాకు కొత్త టీచర్లు

### డిఎస్సీ ఫలితాలు విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డి




### అక్టోబర్ 9న డీఎస్సీ నియామక పత్రాలు
### 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం

హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం సచివాలయంలో డీఎస్సీ పరీక్షల ఫలితాలను సిఎం రేవంత్ విడుదల చేసారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని తెలిపారు. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తామని ప్రకటించారు. పదేళ్లలో గత ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని విమర్శించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, త్వరలోనే గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. మిగతా 2లో.

### ఇచ్చిన హామీలు
# మరచిన కాంగ్రెస్

**రుణామఫీపై రైతులను మోసం చేసిన ప్రభుత్వం**

**ఇందిరాపార్క్ వద్ద దర్నాలో బిజెపి నేతల విమర్శలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ఇచ్చిన హామీలు మరిచావా? మరిచిపోయినట్లు నటిస్తున్నావా'.. అంటూ భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక 1000 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రైతు హామీల సాధన కోసం భాజపా ప్రజా ప్రతినిధులు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు. రేపు ఉదయం పదకొండు గంటల వరకు జరిగే ఈ దీక్షను ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు.




అన్నదాతలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, గోడెం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు దీక్షలో కూర్చున్నారు. ఈసందర్భంగా ఏలేటి మాట్లాడుతూ మిగతా 2లో.

### మూసీ సుందరీకరణకు
# హైడ్రాకు సంబంధం లేదు

**మూసీలో మార్కింగ్ కూడా మేం చేపట్టడం లేదు**

**ఇదంతా మూసీ రివర్ ఫ్రంట్ కార్యక్రమన్న రంగనాథ్**



హైదరాబాద్,,(జర్నలిస్ట్ వార్త): మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని ఆందోళనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతంలో నివాసితుల భద్రత, పునరావాసం, కూల్చివేతలకు సంబంధించిన వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, కమిషనర్ కొన్ని ముఖ్యమైన వివరాలను వెల్లడించారు. మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేలు హైడ్రాకు సంబంధించినవి కాదని స్పష్టంగా అవగాహన చేయాలని కోరారు. మిగతా 2లో.

# ట్రోలింగ్‌తో మానసికంగా వేధిస్తున్నారు



**: మంత్రి కొండా సురేఖ**

**భారాస శ్రేణులు నిద్ర లేకుండా చేస్తున్నారంటూ కంటతడి** 2లో.

# మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

**లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు**

**ఇళ్లు ఇస్తామని..ఇప్పుడు కూలుస్తారా**

**మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ**

**నమామి గంగే ప్రాజెక్టుకే 40వేల కోట్లు**

**సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. లక్షన్నర కోట్లు కర్చు పెట్టి ఎవరిని ఉద్ధరిస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామీ గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామీ గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ ప్రాజెక్ట్ స్టార్ట్




చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ. 40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ. 40వేలుకోట్లు. 50 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ. 1.50లక్షలకోట్ల ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి. దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నానన్నారు.


5లో.

# మిథున్ చక్రవర్తికి ఫాల్కే అవార్డు

**కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటన**

**అక్టోబర్ 8న జరగనున్న 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుకలో పురస్కారం ప్రదానం**

# దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి

(మొదటి పేజి తరువాయి)

ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి నట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిపింది. తత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్టి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

# దసరాకు కొత్త టీచర్లు

(మొదటి పేజి తరువాయి)

డీఎస్సీ 2024 ఫలితాలను విడుదల చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పరిస్థితులు ఖాళీలు చూసుకొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియ అనేది నిరంతరం సాగేదని అన్నారు. ఇప్పుడు డీఎస్సీ ప్రక్రియ నియామక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఇందులో ఉన్న మిగిలిపోయే ఖాళీలు, కొత్తగా ఏర్పడే ఖాళీలు తెప్పించు కొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కచ్చితంగా ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు నియామకాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఏ ఉద్యోగం కూడా ఖాళీ లేకుండా భర్తీ చేస్తామని అన్నారు. త్వరలోనే గ్రూప్ 1 రిజల్ట్స్ కూడా ఇస్తామన్నారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది కానీ అక్కడ కనీస వసతులు కల్పించడంలో పూర్తి ఫెయిల్ అయిందన్నారు. పిట్టగూళ్లలో, పౌల్ట్రీ ఫామ్‌లో పేదల పిల్లలను వదిలేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్ ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఇరవై నుంచి ఇరవై ఐదు ఎకరాలల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మైనార్టీ విద్యార్థులను ఒకే చోట విద్యను అందించబోతున్నామని తెలిపారు. యూనివర్శిటీ స్థాయిలో ఈ రెసిడెన్సియల్ స్కూల్స్ ఉంటాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద




ముందుగా కొడంగల్, మధిరలో ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే పనులు కూడా ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. టెట్ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలోనే గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. 26ఆప్షన్ కింద డీఎస్సీ నిర్వహించామని వివరించారు. 1:3ప్రాతిపాదికన ఫలితాల ప్రకటించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. దసరా లోపే 9అక్టోబర్ నాడు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్ వేసిందని మండిపడ్డారు.మాజీ సీఎం కేసీఆర్ కేవలం 7, 857 టీచర్లను మాత్రమే నియమించారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య మీద పెట్టేది ఖర్చు కాదని తెలిపారు. పది నెలల్లోనే 11062 టీచర్ల భర్తీకి తాము కృషి చేశామని అన్నారు. ఇది తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని తెలిపారు.తమ ప్రభుత్వం వచ్చిన అనతికాలంలోనే 30వేల ఉద్యోగ పత్రాలు అందజేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. గురుకులాల గురించి కేసీఆర్ చెప్పారని..కానీ మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వంద నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటి గ్రెటెడ్ స్కూల్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు ఎందుకు చేయలేదని నిలదీశారు. దీని వల్ల టీచర్లలో నిరాశ ఏర్పడిందని చెప్పారు. 36వేల మంది టీచర్ల బదిలీలను ఎలాంటి విమర్శలు లేకుండా తాము పూర్తి చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని.. దాని వల్ల కొంత సమస్యలు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

## కూల్చివేతలకు ముందు

# ఓనర్లకు సమయం ఇవ్వరా?

**శని,ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి**

**చట్టప్రకారం నడుచుకోక పోతే హైడ్రాపైనే స్టే విధిస్తాం**

**హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం**

**వచ్చేనెల 15 వరకు విచారణ వాయిదా**



హైదరాబాద్ సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా, అమీన్‌పూర్ తహసీల్దార్ కోర్టులో హాజరై వివరణ ఇచ్చారు. శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని అడిగింది. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేసింది. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే విధించిన విషయం తెలియదా? అని అడిగింది. చట్టప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా? అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని బదులివ్వగా.. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముంది?పొలిటికల్ బాస్‌లను సంతృప్తిపరిచేందుకు, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దు. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అధికారులు చట్టవ్యతిరేకంగా పనిచేస్తే ఇంటికెళ్తారు.. జాగ్రత్త అంటూ హెచ్చరించింది. మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచాం. జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయి. మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉంది. కానీ దాని గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదు. మాదాపూర్‌లో ప్రయాణం ఎంత సమయం పడుతుందో తెలుసు కదా? నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉంది. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు. ఎఫ్టీఎల్ నిర్ధరించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తారా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు న్యాయమూర్తి ప్రశ్నించారు. అమీన్‌పూర్‌పైనే మాట్లాడాలని, కావూరిహిల్స్ గురించి అడగలేదంటూ కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని.. జంప్ చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్నామన్నా రంగనాథ్ వివరణపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టును కూడా కూల్చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందన్నారు. కూల్చివేతలు తప్ప వేరే పాలసీ లేదని, ఇది ప్రజల అభిప్రాయమన్నారు. ఈ సందర్భంగా కోర్టులను ఎంతో గౌరవిస్తున్నామని న్యాయమూర్తికి రంగనాథ్ తెలిపారు. మూసీపై కూడా 20 లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని న్యాయమూర్తి వెల్లడించారు. ప్రభుత్వ వ్యవస్థల మధ్య సమన్వయం లేదని చెప్పారు. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచామన్నారు. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా అన్నారు. హైడ్రా ఏర్పాటు అభినందనీయమేనని, పనితీరే అభ్యంతరకమన్నారు. అమీన్‌పూర్ ఎమ్మార్వో, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికమరని చెప్పారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారన్నారు. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదన్నారు.

# ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్

(మొదటి పేజి తరువాయి)

రైతులు ఓట్లేస్తే కాంగ్రెస్ గెలిచిందని గుర్తు చేశారు. రుణమాఫీ పూర్తిగా సాధ్యం కాదని తెలిసి కూడా కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్‌కు లేదని గతంలోనే చెప్పానని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే పూర్తిగా అమలు చేశారన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి అప్పట్లో కేసీఆర్ కూడా పూర్తి చేయలేదు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి హామీని కూడా ఆయన నెరవేర్చలేదు. రూ.లక్ష రుణమాఫీకి రూ.24 వేల కోట్లు అవసరమైతే.. కేవలం రూ.14 వేల కోట్లు ఇచ్చారు. అని ఈటల అన్నారు.

## మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

(మొదటి పేజి తరువాయి)

ఈ సర్వేలు హైడ్రా చట్టం లేదా ప్రాజెక్టుకు సంబంధించినవి కాదని తెలిపారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను హైడ్రా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నివాసితులపై జరుగుతున్న ఇబ్బందులు తప్పనిసరిగా నివారించబడాలని హైడ్రా సంస్థ భావిస్తోందన్నారు.మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని ఆయన తెలిపారు. ఇది నివాసితుల కష్టాలను, అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేయబడిన నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్నదని, ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాన్ని అందంగా మార్చడం, పర్యావరణ సురక్షణపై దృష్టి సారించడం ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ ప్రకటనలు, వాస్తవాలను స్పష్టం చేసేందుకు, ప్రజల భద్రతా ఆశలపై హైడ్రా సంస్థ కట్టుబడినట్టు తెలియజేయడానికి ఒక ప్రయత్నమన్నారు. ప్రజలు భద్రత కోసం కృషి చేయాలని, వాటిని మరింత నిశ్చితంగా, సహాయకరంగా చూడాలని కమిషనర్ కోరారు. ప్రజల, హైడ్రా సంస్థ మధ్య అనుబంధాన్ని మెరుగుపరచడం, స్థానిక అభివృద్ధికి దోహదం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని.. ఆయన సూచించారు.

# ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి బయల్దేరారు. ఇటీవల జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఆయన పరామర్శించనున్నారు. ఆ తర్వాత ఢిల్లీలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన తదితర అంశాలపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాలను ఆయన అధిష్ఠానానికి వివరించే అవకాశముంది.

# తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

## కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఘర్షణ

హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త):

హైడ్రా కూల్చివేతల కారణంగా జరుగుతున్న రాజకీయంలో నేతల మధ్య రాజకీయ వాగ్వాదాలు శృతి మించి పోతున్నాయి. ఫలితంగా దాడులకు సైతం దిగితున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న తెలంగాణ భవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఉద్రికత్త నెలకొంది. ఒక్క సారిగా వందల మంది రావడంతో పోలీసులు ఉలిక్కి పడ్డారు. విషయం తెలిసి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా రావడంతో.. తెలంగాణ భవన్ ఎదురట ఉద్రిక్తత ఏర్పడింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు మంత్రి కొండు సురేఖపై నీచంగా కామెంట్లు పెట్టారని.. పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ వరంగల్ నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ముట్టడికి ప్రయత్నించినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు సరైన సంఖ్యలో లేకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలే వారితో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ఆందోళనల్లో మహిళా నేతలు,కార్యకర్తలు ఉండటంతో పరిస్తితి ఎటు వైపు వెళ్తుందోనని కంగారు పడ్డారు. ఈ వివాదం కారణంగా అత్యంత బిజీగా ఉండే జూబ్లిహిల్స్ కేబీఆర్ పార్క్ రోడ్ లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కాసేపటికి అందర్నీ పంపించివేశారు. ఓ వైపు హైడ్రా విషయంలో హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఇలా తెలంగాణ భవన్‌పైకి కాంగ్రెస్ కార్యకర్తల్ని ఉసిగొల్పడం వెనుక రాజకీయ కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం, టీ న్యూస్ చానల్ కార్యాలయం కూడా ఉంది. చానల్ ఆ భవనం నుంచి ప్రసారమవుతుంది. కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ లోపలికి వరకూ వెళ్లి ఉంటే పెద్ద సమస్య అయ్యేదని అంచనా వేస్తున్నారు. కాసేపటికి పరిస్థితి సద్దుమణిగింది. ఇరవైపులా దాడుల వరకూ వెళ్లకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ భవన్ మీదకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను చితకబాదామని రేవంత్ రెడ్డికీ అదే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ హెచ్చరించింది.

# ట్రోలింగ్‌తో మానసికంగా వేధిస్తున్నారు

## : మంత్రి కొండా సురేఖ

### భారాస శ్రేణులు నిద్ర లేకుండా చేస్తున్నారంటూ కంటతడి

హైదరాబాద్: సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): భారాస నాయకులు సామాజిక మాధ్యమాల్లో తనను కించపరిచేలా ట్రోలింగ్ చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని మంత్రి కొండా సురేఖ కన్నీటిపర్యంతమయ్యారు.




సోమవారం ఆమె గాంధీభవన్‌లో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా కమిటీ ఇన్‌ఛార్జి సామ రాంమోహన్‌రెడ్డిలతో కలిసి మాట్లాడారు. 'ఇన్‌ఛార్జి మంత్రిగా మెదక్ జిల్లాకు వెళ్లాను. అక్కడి భాజపా ఎంపీ రఘునందన్‌రావు చేనేత సమస్యలు వివరించి.. గౌరవంగా చేనేత మాలను నా మెడలో వేశారు. ఈ ఘటనపై భారాస సోషల్ మీడియా శ్రేణులు చెప్పుకోలేని విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. నాకు నిద్ర లేకుండా చేస్తున్నారు. అది చేనేత వృత్తుల వారికి సంబంధించిన గౌరవప్రదమైన నూలు మాల. ఈ పోస్టులు చూసి నా పద్మశాలి కుటుంబసభ్యులు ఆవేదనకు గురై భారాస కార్యాలయానికి వెళితే వారిని కొట్టారు. అధికారం కోల్పోవడంతో భారాస నేతలకు పిచ్చిపట్టి దుర్మార్గమైన ప్రచారాలు చేస్తున్నారు. కేటీఆర్, హరీశ్ ఇంటి ఆడవాళ్లపై ఇలానే మాట్లాడితే ఊరుకుంటారా? ఇకపై వీటిని సహించేది లేదు. నాకు మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహిళలకు మంత్రి పదవులు ఇవ్వలేదు' అని సురేఖ పేర్కొన్నారు.

**సురేఖ అసౌకర్యానికి చింతిస్తున్నా: మాజీ మంత్రి హరీశ్‌రావు**

సామాజిక మాధ్యమాల వేదికగా జరిగే వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నానని, మంత్రి కొండా సురేఖకు కలిగిన అసౌకర్యానికి ఆమెతోపాటు తానూ చింతిస్తున్నానని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విచారం వ్యక్తం చేశారు. ఈ అంశంపై 'ఎక్స్' వేదికగా సోమవారం ఆయన స్పందించారు. 'మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించడాన్ని ఏ ఒక్కరూ సహించరు. ఈ విషయంలో భారాస అయినా ఉపేక్షించబోం. సామాజిక మాధ్యమాల్లో బాధ్యతగా వ్యవహరించాలని అందరినీ కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త):** ప్రజావాణి కార్యక్రమంలో సమర్పిస్తున్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వివిధ శాఖల వారిగా అధికారులను సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణ వేణి, డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి పాల్గొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ప్రజావాణిలో మొత్తం 103 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎక్కువగా రెవెన్యూ శాఖకి సంబంధించిన భూ సంబంధిత సమస్యలపై 53 దరఖాస్తులు, జిల్లా విద్యాశాఖ, జిడబ్ల్యూఎంసికి 6 చొప్పున దరఖాస్తులు, వ్యవసాయ శాఖకు 5 వచ్చాయని, మిగతావి వివిధ శాఖలకు సంబంధించి, అనేక సమస్యలపైన దరఖాస్తులు వచ్చాయన్నారు వచ్చిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ సమస్యలు తదితర సమస్యలపైన దరఖాస్తులు వచ్చాయని, వాటిని వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించేలా వివిధ శాఖల అధికారులు నిబద్ధతతో పని చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారులకు సరియైన పోషక ఆహారాలు అందించాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**







ఖిలా వరంగల్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ లోని ముదిరాజ్ భవనంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమవతి అధ్యక్షతన సోమవారం పోషణ మాసం ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు నెల రోజుల పాటు కొనసాగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లులు, పిల్లలందరికీ సరైన పోషకాహారం అందించాలని, వారికి సరైన ఎదుగుదలనివ్వాలన్నారు. 3 సంవత్సరాల పిల్లలని అంగన్వాడి సెంటర్లకి ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోసం పంపించాలని అన్నారు. అంగన్వాడి సెంటర్లని ఆధునికరించుతున్న క్రమంలో ప్రజలు అందులో భాగస్వాములై వాటికి తోడ్పాటును అందిస్తూ, ప్రభుత్వ పథకాలను అందుకోవాలని కోరారు. పిల్లలకి శారీరక మానసిక ఎదుగుదల ఎంతో ముఖ్యమన్నారు. అవి అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ టీచర్లు శిక్షణ తీసుకొని ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున తల్లిదండ్రులందరూ అంగన్వాడీ సెంటర్లకి తమ పిల్లల్ని పంపించాల్సిందిగా కోరారు. పోషణ మాసాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఇప్పటివరకు 39,816 వేల కార్యక్రమాలను, నాలుగు లక్షల 80 వేల మందితో 919 అంగన్వాడీ సెంటర్లలో కార్యక్రమాలు నిర్వహించినట్లు పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు భైర బోయిన ఉమా దామోదర్ , గుండు చందన పూర్ణచందర్, పోశాల పద్మ స్వామి, పద్మా రవి ఐసిడిఎస్ ప్రాజెక్టు వరంగల్ సిడిపిఓ విద్య , వర్ధన్నపేట సిడిపిఓ యం.డేబోరా, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఏసిడిపిఓ హేమలత, ఖిలా వరంగల్ సెక్టార్ సూపర్వైజర్ బి. కళ్యాణి, జిల్లా సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, లబ్ధిదారులు బాలింతలు, ఆరు నెలలు నిండిన పిల్లలు, మూడు సంవత్సరాలు దాటిన పిల్లలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- దత్తు ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపల్ రమేష్**

**- చెత్తను తొలగించి పరిశుభ్రత పనులు ప్రారంభించిన విద్యార్థులు**




తొర్రూర్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): తొర్రూర్ పట్టణ కేంద్రంలోని దత్తు ఒకేషనల్ కాలేజీ పరిసర ప్రాంగణంలో సోమవారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మేరా యువ భారత్ జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొర్రూర్ మండలం చింతలపల్లి రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులచే పరిసరాల పరిశుభ్రత, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపల్ రమేష్, టీచర్ సాగర్, వార్డెన్ మధురిమ, విద్యార్థులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే పద్ధతులు చిన్నతనం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ వాలంటీర్ ఎన్ రమేష్, సురేష్, మండల ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.ం

# కస్తూర్బా గాంధీ పాఠశాల బాలికలకు హెల్త్ కార్డుల పంపిణీ

**- హెల్త్ క్యాంపులు నిర్వహించి విద్యార్థుల యోగా క్షేమాలు పరీక్షించాలి**

**- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**









వర్ధన్నపేట, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండల కేంద్రంలో హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరైనారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలుగా కడియం కావ్య ఎన్నికైన సందర్భంగా మొట్టమొదటి సారిగా మల్లన్న స్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలోని అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం అందించారు. స్వామివారి శేష వస్త్రాలను సమర్పించి, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాల బాలికలకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి, ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్యంపై చాలా దృష్టి సారించి, ప్రత్యేక చొరవ తీసుకుంటూ, విద్యార్థినీ లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి హెల్త్ క్యాంప్ నిర్వహించి, వారి సమస్యల పరిష్కరిస్తున్నారని కొనియాడారు. విద్యార్థినీయులు తమ వ్యక్తి గత సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయ వద్దని, విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మీ మంచి పేరు తీసుకొనిరావాలని కోరారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో విద్యార్థినీలకు క్రీడా కిట్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య డిఎంహెచ్ ఓ లలితాదేవి, డిఈఓ వాసంతి, ఐనవోలు ఎమ్మార్వో విక్రమ్, ఎంపీడీవో, అధికారులు హెల్త్ సిబ్బంది ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఐనవోలు మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోళ్లఫారం నుండి మంచినీళ్ల చెరువు రక్షించండి

**- కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన గ్రామ పరిరక్షణ కమిటీ**



రాయపర్తి, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ హెచరీస్ (కోళ్లఫారం) నుండి వెలువడే వ్యర్థాల భారీ నుండి మంచినీళ్ల చెరువును రక్షించాలని సోమవారం జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవికి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రావుల భాస్కర్ రావు, పొల్వంచ కోటేశ్వర్, ఐత రాంచందర్, మచ్చ నిలయ్య, ముద్రబోయిన సుధాకర్, మాచర్ల పరమేష్, చందు రాము, కోతి కళ్యాణ్, పిరని వెంకన్న, ఉబ్బని సింహాద్రి, కొండపల్లి సందీప్, నూనె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ మతాల పేరుతో ప్రజలను విభజించి పాలిస్తుంది

**- సిపిఎం నేత ప్రకాష్ విమర్శ**

**- ఎర్రజెండా ఆవిష్కరించిన సిపిఎం నాయకులు రమణ**



మంచిర్యాల, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): కేంద్రం పాలనలో ఉన్న బిజెపి పార్టీ మతాల పేరుతో ప్రజలను విభజించి, పాలిస్తుందని సిపిఎం అధినేత ప్రకాష్ విమర్శించారు. సోమవారం బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీ అయినా సరే అధికారంలో ఉన్నా, లేకున్నా రాజ్యాంగం బద్ధంగా నడవాలన్నారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సీనియర్ నాయకులు రమణ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా పోరాటాల్లో అసువులు బాసిన అమరులకు నివాళులు అర్పించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించకపోతే ఇతర పార్టీల నేతల మనోభావాలను దెబ్బతీస్తుందని సూచించారు. రాజ్యాంగ సవరణను విమర్శించి మాట్లాడడం, తప్పుడు తోవలకు పాల్పడినట్లేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న ఆలయంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

**- కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు**



వర్ధన్నపేట, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో మాసశివరాత్రి సందర్భంగా శ్రీ స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, శ్రీ స్వామి వారి కళ్యాణం, ఒగ్గు పూజారులచేత పెద్ద పట్నం కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేదపండిత్ గట్టు పురుషోత్తం శర్మ, అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న దేవాలయంలో నందీశ్వర స్వామికి అభిషేకం



వర్ధన్నపేట, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోషకాలంలో శ్రీ నందీశ్వర స్వామి వారికి అభిషేకం చేసినట్లు సోమవారం దేవాలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, దేవాలయ ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణ దారు విక్రాంత్ వినాయక్ జోషి శర్మ, అర్చకులు నందనం మధు శర్మ, పాతర్లపాటి నరేష్ శర్మ, దేవేందర్, సాయిరామ్ శర్మ, సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకశిల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

- ఉత్తమ సమూహాలకు ప్రోత్సాహక బహుమతులు
- బతుకమ్మ విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన పాఠశాల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి





వర్ధన్నపేట, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండలం పున్నేలు గ్రామ శివారులోని ఏకశిల సి.బి.ఎస్. ఇ. అండ్ స్టేట్ స్కూల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. సోమవారం సుమారు 2 వేల మందితో బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బతుకమ్మ, విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అవతరించాక బతుకమ్మ పండుగ విశిష్టత దేశ వ్యాప్తమైందన్నారు. బతుకమ్మ పండుగ ప్రత్యేకత, విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. ఈ వేడుకలు సోదరభావంతో, ప్రేమానురాగాలతో జరుపుకునే పండుగ అన్నారు. సమస్త మానవాళిని ప్రకృతితో మమేకం చేయటమే ఈ పండుగ లక్ష్యమన్నారు. సాధారణంగా ఈ సమయంలో హానికారక దోమల వంటి కీటకాలను సంహరించాటానికి దోహదపడుతుందన్నారు. బతుకమ్మకు ఉపయోగించే తంగేడు, గుణుగు, గుమ్మడి, బీర, తామర ఔషధ



మొక్కల పూలు నీటిలో వేస్తే, విడుదలయ్యే రసాయనాలు దోహదం చేయటమే కాక, సకల ఆరోగ్య సమస్యల నుండి రక్షింపబడతామని హితవు పలికారు. జరిగిన వేడుకలలో ఏకశిల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు రంగు రంగుల సాంప్రదాయక నూతన దుస్తులతో, ప్రకృతి నుండి తెచ్చిన తీరొక్క రంగు పువ్వులతో పేర్చిన అందమైన బతుకమ్మలు చేతబూని, ఆట పాటలతో పాఠశాల పెద్దల్ని ఆహ్వానించి, ఆసీనులను చేసి, ధూప, దీపాలతో గౌరమ్మ సహిత భారీ బతుకమ్మను నిర్వహణ స్థలంలో నాటిన వెంపల్ చెట్టు మొదట పెట్టి, ప్రకృతిని కంటికి రెప్పలా కాపాడుతామని, తెలంగాణ సంప్రదాయాల్ని పాటిస్తామని, వాగ్దానాలు చేసి, పదునెనిమిది జట్టులుగా కూడి, పురాతన సంప్రదాయ బతుకమ్మ పాటలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాటల్ని పాడుతూ, కోలాటం వేస్తూ, శాస్త్రీయ, సాంప్రదాయ నృత్య రీతులతో ఆట, పాటలతో బతుకమ్మ వేడుకల్ని అంగ రంగ వైభవంగా నిర్వహించారని తెలిపారు. అటు పిమ్మట స్త్రీలు. బాలికలు గౌరమ్మకి నైవేద్యం పెట్టి, పాఠశాల సిబ్బందికి, విద్యార్థులకు ప్రసాద వితరణ చేయడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. బాబా తెలిపారు. ఈ సందర్భంగా సాంప్రదాయబద్ధంగా పెద్దగా అలంకరించిన బతుకమ్మలకు, పాటలు పాడి ఆడిన ఉత్తమ సమూహాలకు చైర్మన్ తిరుపతి రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవి కిరణ్, స్టాఫ్ ఇన్ చార్జీలు, సెలెబ్రేషన్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు.

# మాదిగ జాతికి ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- పదవి బాధ్యతలకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలి
- మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో దళిత నాయకుల ఆందోళన
- పట్టణ కేంద్రంలో ర్యాలీ ప్రదర్శన
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం




వర్ధన్నపేట, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ఏబీసీడీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ, కుట్రలు చేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సోమవారం ఉద్యమించిన మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో దళిత నాయకులు ఆందోళనలకు దిగారు. మాదిగలు బ్లాక్ మెయిలర్లు అంటూ మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, అనుచిత వ్యాఖ్యలు చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు వ్యతిరేకంగా వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వర్ధన్నపేట బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ ప్రదర్శించి, ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలతో పట్టణ కేంద్రంలో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా: బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నిరసన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నిపార్టీల నాయకులు, యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కేఆర్ నాగరాజు ఒక్క మాదిగ వ్యతిరేకియే కాదు, మొత్తం దళితజాతి వ్యతిరేకి అంటూ విమర్శించారు. కేఆర్ నాగరాజు చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమా..? కాంగ్రెస్ పార్టీ ఉద్దేశ్యమా..? స్పష్టం చేయాలని హెచ్చరించారు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే నాగరాజును పార్టీ నుంచి బహిష్కరించాలని, మాదిగ జేఏసీ నాయకులు రవీందర్, కుమారస్వామి డిమాండ్ చేశారు. ఏబీసీడీ వర్గీకరణ అనేది మా జాతి ఏండ్ల తరబడి చేసిన పోరాట ఫలితం అన్నారు. వర్గీకరణను అడ్డుకునేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరును ప్రజలు గమనిస్తున్నారని గుర్తుచేశారు. మాదిగలు కాదు బ్లాక్ మెయిలర్లు అంటూ ప్రస్తావించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు అధికారాన్ని అడ్డుపెట్టుకొని కోట్లు సంపాదించిన ఆయనే అసలైన బ్లాక్ మెయిలర్ అని



ఆరోపించారు. మాదిగ జాతికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పి, రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని మాదిగ జేఏసీ సభ్యులతోపాటు ప్రజా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యాభర్తల వివాదం కేసు... ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీజేఐ

**కేసును సాగదీస్తే న్యాయవాదులకే ప్రయోజనమని వ్యాఖ్య**

**పరస్పర సమ్మతితో విడాకులకు అంగీకరించాలని సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ఓ దంపతులకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వైవాహిక బంధంలో వివాదాల వ్యవహారంలో సుదీర్ఘ న్యాయపోరాటం వల్ల న్యాయవాదులకే ప్రయోజనం కలుగుతుందని, కాబట్టి దంపతులు అవసరమైతే పరస్పర సమ్మతితో విడాకులకు అంగీకరించాలని ఓ జంటకు సూచించారు.తమ భార్యాభర్తల కేసును మరో కోర్టుకు బదిలీ చేయాలని ఓ కేసులో మహిళ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా మహిళ ఏం చేస్తుందో సీజేఐ చంద్రచూడ్ అడిగి తెలుసుకున్నారు.తాను ఎంటెక్ పూర్తి చేశానని, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం తాను ఉద్యోగం ఏమీ చేయడం లేదని కూడా వెల్లడించింది.మీరు మంచి విద్యావంతులు, కాబట్టి మొదట ఉద్యోగం సంపాదించుకోవాలని సూచించారు. అదే సమయంలో ఈ కేసులో మీరు పదేళ్లైనా న్యాయ పోరాటం చేయగలరేమో కానీ అలా చేయడం వల్ల న్యాయవాదులకు మాత్రమే ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. కాబట్టి పరస్పర సమ్మతితో విడాకులు తీసుకోవడానికి ఎందుకు అంగీకరించకూడదు? అందుకు మీరు సిద్ధపడితే మాత్రం కేసును క్లోజ్ చేస్తామన్నారు.



# కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం మానుకోవాలి

- అసత్య ప్రచారం చెయ్యడం వల్ల ప్రయోజనం లేదు
- మాల మహానాడు నాయకులు మన్నే బాబురావు



వర్ధన్నపేట, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అనని మాటలను వక్రీకరించి, కావాలని కొంతమంది అక్కడక్కడ ఏకమై కావాలని ప్రెస్ మీట్ పెడుతూ, ర్యాలీలు తీస్తూ, ఏదో సాధించుకొందామని అదేపనిగా అసత్య ప్రచారం చేస్తున్నారని సోమవారం మాల మహానాడు నాయకులు మన్నె బాబురావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా నాయకులు ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు తాను కష్టపడి చదివి ఐపిఎస్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించి, రిటైడ్ ఐన వెంటనే రాజకీయ బాధ్యతలు చేపట్టారని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా సుమారు 20 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందిన వారు నీరు పేద దళిత, బడుగు బలహీను అభివృద్ధి కోసం పాటు పాటు పడుతున్నారని తెలిపారు. చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక కొందరు ఎమ్మెల్యేపై బూరుద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారని విమర్శించారు. కుల, మత, బేధం లేకుండా అభివృద్ధి చేస్తున్న వారిపై వర్ధన్నపేట ప్రజలు ప్రెస్ మీట్ పెట్టి, గత 2, 3 మూడు రోజుల నుండి పదేపదే అదే పనిగా పెట్టుకొని, కులాల మధ్య విభేదాలు తీసుకోచ్చే ప్రచారం చేస్తున్నారన్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరి మతం వారిది, ఎవరి కుల వారికే గొప్ప అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బహినుల పక్షాన నిలిచే పార్టీ అన్నారు. ఎవరు ఏంటో అన్నది ప్రజలకు తెలుసన్న సంగతి మరిచిపోవద్దన్నారు. గ్రామాలో వున్నా సమస్యలు, రోడ్లు, చదువు, లాంటి వాటిపై ద్రుష్టి పెడితే మంచిదన్నారు. ఎమ్మెల్యే పై దుష్ప్రచారం చేయడం వల్ల ఏమి ప్రయోజనం ఏమీ లేదన్నారు. ప్రజా సమస్యల పరిస్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# డిజిట్ కార్డులపై 3నుంచి క్షేత్రస్థాయి పరిశీలన

## అధికారులో మరోమారు సిఎం రేవంత్ సమీక్ష




హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ సమయంలో కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధరించాలన్నారు. కుటుంబ డిజిటల్ కార్డులపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. డిజిటల్ కార్డుల కోసం సేకరించే వివరాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.అక్టోబరు 3 నుంచి 7 వరకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు, 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. కొత్త సభ్యులకు జత చేసి, చనిపోయిన వారిని తొలగించాలి. పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన వివరాలతో నివేదిక తయారు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాల మార్పులు చేర్పుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేక, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రైతులను రోడ్డుకీడ్చిన ఘనత బిజెపిది

**వీరు రైతుల గురించి మాట్లాడడమా - బిజెపి నేతల ధర్నాపై మండిపడ్డ తుమ్మల**

హైదరాబాద్ సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి.. కాశీకి పోయినట్లుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రైతులను రాజధాని వీధులకు ఈడ్చిన ఘనత బిజెపిదన్నారు. రైతు చట్టాలతో ఎంతమంది ఉసురు తీసారో చెప్పగలరా అని ప్రశ్నించారు. చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదని భాజపా నాయకులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు కాదు కదా.. గత పదేళ్లలో పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే నికర ఆదాయం పెరగని వాళ్లందరి సమాచారం మీ దగ్గర ఉందా? స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి.. రైతులను ఆదుకోవాలంటూ రాజధాని వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న వారి విజ్ఞప్తులను ఎప్పుడైనా పట్టించుకున్నారా? భాజపా పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా రుణమాఫీ చేసి చూపించగలరా? రూ. లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తల నుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ చేయగల నిబద్ధత మీకుందా? కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు భరోసా కల్పించే బాధ్యత మాది. ఇప్పటికే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాం. పంటలన్నింటినీ మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తుమ్మల పేర్కొన్నారు.

# మెట్రో ఆఫర్ గడువు మార్చి వరకు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైలు గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రయాణికులకు అందిస్తున్న ఆఫర్లను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2025 మార్చి 31 వరకు ఆఫర్లను పొడిగించినట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం అందిస్తున్న సూపర్ సేవర్-59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ ఆఫర్లను పొడిగించింది. అక్టోబర్ 6 నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామమాత్రపు పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌలభ్యం, భద్రత కోసమే ఈ రుసుము వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు.

# కాళేశ్వరం అవినీతిపై దేశమంతా తెలుసు

## తప్పలు కప్పిపుచ్చుకునేందుకే బిఆర్ఎస్ ఆరోపణలు

**మండిపడ్డ మంత్రి సీతక్క**



హైదరాబాద్, సెప్టెంబర్ 30,(జర్నలిస్ట్ వార్త): ప్రాజెక్టు విషయంలో భారాస చేసిన అవినీతి దేశమంతా తెలుసని మంత్రి సీతక్క పేర్కొన్నారు. భారాస పాలనలో జరిగిన తప్పిదాలను కనుమరుగు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో మూసీ పరివాహకంలో ఎన్నో అక్రమ కట్టడాలు వెలిశాయన్నారు. కొందరు చెరువుల మధ్యలో భవనాలను నిర్మించారన్నారు. మూసీ పరివాహకంలో ఎక్కువగా నేతల భవనాలే ఉన్నాయని, వాటిని పేదలకు అ÷-దదెకు ఇచ్చారని విమర్శించారు. మూసీలో ఆక్రమణలతో అందరికీ ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. సామాన్యులకు నష్టం కలగకుండా చూస్తామన్నారు. ఇళ్లు కోల్పోతున్న పేదలకు స్థిర నివాసం కల్పిస్తామన్నారు. మిడ్ మానేరు, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల విషయంలో నిర్వాసితులను భారాస ఎంత నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయించారో అందరికీ తెలుసని, ఇప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు.



# మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

మన దేశంలో సినీ రంగానికి సంబంధించి ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'దాదా సాహెబ్ ఫాల్కే' ప్రధానమైనది. ఈ ఏడాది అవార్డుకు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 8న జరగనున్న జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర, సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ పోస్ట్ పెట్టారు. మిథున్ చక్రవర్తి అద్భుతమైన సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ ఏడాది దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనకు అందించాలని జ్యూరీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. మిథున్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ చలన చిత్ర రంగానికి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉంది. విభిన్నమైన నటనతో ఆయన ఎన్నో తరాలను అలరించారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ఆయనకు నా అభినందనలని ప్రధాని పేర్కొన్నారు. ఈ పురస్కారానికి తాను ఎంపిక కావడంపై మిథున్ ఆనందం వ్యక్తంచేశారు. మాటలు రావడం లేదు. ఇలాంటి గొప్ప విజయాన్ని నేను అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉన్నా. నా కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దీనిని అంకితం చేస్తున్నానని తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. బాలీవుడ్‌లో ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేసి పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. హీరోగానే కాకుండా సహాయనటుడు, విలన్‌గా కూడా ఆయన ఎంతోమంది స్టార్ హీరోల చిత్రాల్లో నటించారు. 1976లో 'మృగాయ'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. 'ముక్తి', 'బన్సారీ', 'అమర్‌దీప్', 'ప్రేమ్ వివాహ్', 'భయానక్', 'కస్తూరి', 'కిస్మత్', 'మే ఔర్ మేరా సాథి', 'సాహాస్', 'వాంటెడ్', 'బాక్సర్', 'త్రినేత్ర', 'దుష్మన్', 'దలాల్', 'భీష్మ', 'సుల్తాన్', 'గురు', 'కిక్', 'బాస్', డిస్కోడాన్సర్ వంటి చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. హిందీ, బెంగాలీ చిత్రాలతోపాటు కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ ఆయన నటించారు. 'గోపాల గోపాల'తో తెలుగు వారికి సుపరిచితమయ్యారు. ఇందులో ఆయన ప్రతినాయకుడిగా కనిపించారు. అనంతరం 'మలుపు' అనే టాలీవుడ్ మూవీలోనూ ఆయన యాక్ట్ చేశారు. 'ఐ యామే డిస్కో డాన్సర్' అన్న పాటతో దేశవిదేశాల్లో గుర్తింపు తెచ్చుకొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆయనకు పద్మభూషణ్ అవార్డును కేంద్రం అందజేసింది.

# నారాయణమంత్రంపై కీరవాణి ఆడియో

### అభినందించిన డిప్యూటీ సీఎం పవన్






ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం. ఎం. కీరవాణికి ధన్యవాదాలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓ ప్రకటనను విడుదల చేశారు. తిరుమల మహా ప్రసాదం అయిన లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై పవన్ కళ్యాణ్ ఈ ఆవేదన నిమిత్తం ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాయశ్చిత్త నిమిత్తం అంతా నారాయణ మంత్రం పఠిస్తున్నారు. అలా నారాయణ మంత్రం పఠించే వారందరి కోసం సంగీత దర్శకుడు కీరవాణి ఓ ఆడియో రికార్డ్ చేశారు. ఆడియో రికార్డ్ చేసిన కీరవాణికి, ఆయన టీమ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. జనసేన పార్టీ తరపున పవన్ కళ్యాణ్ అధికారికంగా ఓ ప్రకటనను విడుదల చేశారు. అందులో.. 'ఓం నమో నారాయణాయ' మంత్రాన్ని ప్రజానీకం పఠించేందుకు అనువుగా ఆడియో రికార్డు రూపొందించిన ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తిరుమల మహా ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం భక్తి భావం కలిగిన ప్రతి ఒక్కరికీ తీవ్ర ఆవేదన కలిగించింది. ఈ ఆవేదన నుంచే ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించాను. ఈ దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులతో పాటు ధార్మిక విశ్వాసాలు కలిగినవారందరూ ఆలయాల్లో పూజలు, హోమాలు, భజనలు చేస్తున్నారు. వారంతా ఓం నమో నారాయణాయ మంత్రం పఠిస్తున్నారు. అందుకు అనువుగా కీరవాణి ఆడియో రికార్డు చేశారు. భక్తి భావంతో సాగింది. ఇందులో భాగం పంచుకున్న సంగీత కళాకారులకి, సాంకేతిక నిపుణులకి ధన్యవాదాలు. ధర్మో రక్షతి రక్షిత:' అని పేర్కొన్నారు.

# ఐటం పాటల్లో పాండే కండీషన్లు!

ఐటం పాటలకు ఏ నటి ఒకే చెప్పినా? పెద్దగా కండీషన్లు అంటూ ఏవీ లేకుండానే నటిస్తున్నారు . ఐటం పాట అంటేనే యువతలో ఊపు తెచ్చేది. ఆపాటని కమర్శియల్ కోణంలో డిజైన్ చేసి సినిమాల్లో పెడు తుంటారు. ఆ పాట కోసం స్టోరీ డిమాండ్ చేయాల్సిన పనిలేదు. సన్నివేశానికి నాన్ సింక్ అవుతుంది? అనే అవసరం లేదు. కమర్శియల్ సినిమా అయినా..పీరియాడిక్ స్టోరీ అయినా హాట్ బ్యూటీతో ఐటం పాట అన్నది? ఓ స్పెషల్ గా భావిస్తారంతా. ఈ కల్చర్ దాదాపు అన్ని భాషల్లోనూ ఉంది. ముఖ్యంగా టాలీవుడ్..బాలీవుడ్..కోలీవుడ్లో కనిపిస్తుంటుంది. ఐటం పాటల్లో స్టార్ హీరోయిన్లే నటిస్తున్నారు. ఎలాంటి కండీషన్లు పెట్టకుండా అందాలు ఆరబోస్తున్నారు. హీరోయిన్లు ఇలాంటి టర్నింగ్ తీసుకోవడంతో ప్రోఫెషనల్ ఐటం గాళ్స్ కి డిమాండ్ తగ్గిందన్నది వాస్తవం. ఫాంలో ఉన్నా లేకపోయినా? మంచి పారితోషికం వస్తుందంటే నో చెప్పకుండా పనిచేస్తున్నారు. తాజాగా లైగర్‌బ్యూటీ అనన్యా పాండే కూడా ఐటం పాటలకు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చింది. అయితే అమ్మడు ఇక్కడ కండీషన్లు అప్లై అంటోంది. అన్ని సినిమాల్లోనూ ఐటం పాటల్లో నటించనని...కేవలం ఐటం పాటలు డిమాండ్ చేసే సినిమాలు తప్ప! మిగతా సినిమాల్లో అవకాశాలు వచ్చిన అలాంటి పాటలు చేయనంటోంది.పాటలో అమ్మాయికి ప్రాధాన్యతతో పాటు, దాన్ని గౌరవంగా భావించేలా ఉండాలి అంటోంది. అలాంటప్పుడే ఐటం పాటలో నటిస్తుందిట. తన నియమాలకు అనుగుణంగా ఐటం పాటలు వస్తే చేస్తాను తప్ప లేదంటే నిర్మొహమాటంగా నో చెప్పాస్తాను అంది. ఐదేళ్ల నట జీవితంలో ఇంతవరకూ ఐటం పాటలు చేయలేదు. వస్తే మాత్రం ఇలాండి కండీషన్లు మధ్య ఒకే చెబుతుందిట.



# విమర్శలకు చెక్ పెట్టిన గేమ్ చేంజర్ రా మచ్చారా

### మెగా ఫ్యాన్స్ ఊగిపోయేలా... 'రా మచ్చా మచ్చా' సాంగ్ విడుదల




మెగా ఫ్యాన్స్ ను అలరించేందుకు రామ్ చరణ్ 'గేమ్ చేంజర్' చిత్రం నుంచి రెండో పాట విడుదలైంది. ఇప్పటికే 'జరగండి' పాటతో ఆడియన్స్ లో విపరీతమైన క్రేజ్ పెంచేసిన గేమ్ చేంజర్ చిత్రబృందం... నేడు 'రా మచ్చా మచ్చా' పూర్తి పాటను రిలీజ్ చేసింది. తమన్ బాణీలకు అనంతశ్రీరామ్ సాహిత్యం అందించారు. గాయకుడు నకాష్ అజీజ్ ఆలపించారు.

'గేమ్ చేంజర్' చిత్రంలో ఈ పాట రామ్ చరణ్ ఇంట్రడక్షన్ సాంగ్ కావడంతో దర్శకుడు శంకర్ ఎంతో శ్రద్ధతో ఈ పాటను చిత్రీకరించినట్టు విజువల్స్ చెబుతున్నాయి. 1000 మంది కళాకారులతో రామ్ చరణ్ స్టెప్పులు ఈ పాటలో హైలైట్. దిల్ రాజు, శిరీష్ నిర్మాతలుగా రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రం ఈ ఏడాది డిసెంబరులో క్రిస్మస్ సీజన్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా... అంజలి, సముద్రఖని, ఎస్ జే సూర్య, శ్రీకాంత్, సునీల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

# తండేల్‌లో నాగచైతన్య..సాయిపల్లవి డ్యాన్స్ సాంగ్



నవ యువ సామ్రాట్ నాగచైతన్య, లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి జంటగా నటిస్తోన్న రెండో చిత్రం 'తండేల్' పాన్ ఇండియాగా రూపొందుతున్న ఈ మూవీకి కార్తికేయ2 ఫేం చందూ మొండేటి దర్శకత్వం వహిస్తుండగా అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్2 బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మించారు. శ్రీకాకుళం జిల్లా డి.మచ్చిలేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ తండేల్ సినిమాను తెరకెక్కించడం విశేషం. వాస్తవ ఘటనలతో రూపొందిస్తున్న ఈ సినిమాలో ఇద్దరు ప్రేమికుల మధ్య వారి జీవితాల్లో సంభవించిన పరిస్థితులు, భావోద్వేగాలు ఇతర పరిస్థితులను చాలా గ్రిప్పింగ్‌గా, ఆకర్షణీయంగా తెరపై మలుస్తున్నాడు దర్శకుడు చందు మొండేటి. అదేవిధంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాకుళంలోని పురాతన శివాలయం శ్రీముఖలింగం సన్నిధిలో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను ప్రేరణగా తీసుకుని ఈ సినిమా కోసం మునుపెన్నడూ చూడని రీతిలో ఓ ప్రత్యేక శివరాత్రి పాటను ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలో ఇప్పటికే శివరాత్రి ఉత్సవ వైభవాన్ని తెలియజేసేలా భారీ సెట్టింగ్‌లు మరియు అత్యంత వ్యయంతో అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో ఓ పాటను చిత్రీకరించారు. ఈ పాటలో నాగ చైతన్య, సాయి పల్లవిలతో పాటు వేలాది మంది డ్యాన్సర్‌లతో కలిసి డ్యాన్స్ చేశారు. అయితే ఈ పాట నాగ చైతన్య సాయి పల్లవిల కెరీర్‌లోనే మోస్ట్ స్పెషల్ సాంగ్స్ లో ఒకటిగా ఉండబోతుండగా దసరా పర్వదినం సందర్భంగా త్వరలోనే ఈ సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు తాజాగా పాట షూటింగ్ సందర్భంగా తీసిన ఫొటోలను మేకర్స్ విడుదల చేశారు. కాగా ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు. త్వరలోనే అధికారికంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేయనున్నారు.




# జీబ్రా మూవీ టీజర్ విడుదల

యువ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా' లక్ ఫేవర్స్ ది బ్రేవ్.. అన్నది ఉపశీర్షిక. ఈ సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే యాక్షన్ క్రైమ్ కామెడీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మత్తు వదలరా ఫేం సత్య కూడా టీజర్‌లో మరోసారి నవ్వులు పూయించాడు. ప్రియా భవానీ శంకర్ , జెన్నిఫర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) విలన్ పాత్రలో నటిస్తున్నాడు. సునీల్ సత్యరాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.